సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం, 10, జూలై, 2025



మత్స్యం.. కొల్లేరు ప్రత్యేకం
చేపల గుడ్ల ఉత్పత్తి పెంచేందుకు చేసిన ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ఏటా జూలై 10న చేప రైతుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 4లో ▸



ఆధ్యాత్మిక చింతనలో.. అతివలు
ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతత నిచ్చేది ఆధ్యాత్మిక చింతన. ఆ దిశగా ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేవుడి సేవలో తరిస్తున్నారు మహిళలు. 4లో ▸



641 కిలోల గంజాయి ధ్వంసం
జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు 641 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు వర్గాలు తెలిపాయి. 4లో ▸

వరద గోదావరి

- ముంపు మండలాల్లో అప్రమత్తం
- ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు
- పోటెత్తుతున్న గోదావరి, శబరి
- 8 రోజుల వ్యవధిలో పోలవరం నుంచి 13.88 లక్షల క్యూసెక్కులు విడుదల
- మరో వారం కొనసాగనున్న గోదావరి ఉధృతి



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి దిగువన ప్రవహిస్తున్న వరద

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వరద గోదావరి మళ్లీ పోటెత్తుతుంది. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గోదావరిలో జలకళ మొదలైంది. గత వారం రోజులుగా రోజుకు సగటున 2 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో తీవ్రత మరింత పెరుగుతుందని దానికనుగుణంగా 9.32 లక్షల క్యూసెక్కుల నీరు 15 కల్లా వస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు వరద ప్రవాహంతో ముంపు మండలాల్లో అలజడి మొదలైంది. గోదావరికి వరదల సీజన్ ప్రారంభమైంది. వాస్తవానికి జూలై మొదటి వారం నుంచి వరద హడావుడి ప్రారంభమై ఆగస్టు వరకు రెండు సార్లు ముంపు మండలాల్ని అతలాకుతలం చేస్తోంది. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యం కావడం, ఇతర కారణాలతో వరద ఉధృతి గతంతో పోల్చితే తక్కువగానే ఉంది. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన వరద నీరు క్రమేపీ పెరుగుతూ వచ్చింది. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరి ఉపనది శబరి పోటెత్తుతుంది. ఈ క్రమంలో ఈనెల 2న 1.06 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. 5వ తేదీ నాటికి 2.09 లక్షల క్యూసెక్కులు, 9 నాటికి 2.27 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. వరద పోటెత్తే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేశారు. ఈ నెల 15 కల్లా 9,32,288 క్యూసెక్కుల నీరు పోలవరానికి చేరుతుందని, అదే విధంగా భద్రాచలం వద్ద 43 అడుగుల నీటిమట్టంతో మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేయవచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. దిగువకు విడుదలవుతున్న నీటిని పోలవరం నుంచి పూర్తి స్థాయిలో డిశ్చార్జ్ చేస్తున్నారు.

కొనసాగనున్న ఉధృతి

బుధవారం మధ్యాహ్నానికి భద్రాచలంలో **22.40 అడుగుల మే**ర నీటిమట్టం ఉంది. ఎగువ **నుంచి ఇన్‌ఫ్లో ఎక్కు**వగా ఉండటంతో గురువా**రానికి 3 నుంచి 4** అడుగులు పెరిగే అవకాశం **ఉందని అంచనా వే**స్తున్నారు. 1986లో 75.60 **అడుగుల మేర నీ**టి మట్టం ఉండటంతో 27 **లక్షల క్యూసెక్కుల** నీరు దిగువకు విడుదలైంది. **ఇంతవరకు అత్యధి**కంగా వచ్చిన వరద ఇదే. **వేలేరుపాడు, కుక్కు**నూరు మండలాల్లో అత్య**ధిక గ్రామాలు ఖాళీ**గా నష్టపోయాయి. ఆ తరు**వాత 2022లో 71.**30 అడుగుల నీటిమట్టంతో 21.78 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరానికి ఒకేసారి విడుదలైంది. ఈ క్రమంలో ముంపు మండలాలతో పాటు పశ్చిమలోని లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. 2022లో జూలై 6న, 2023లో జూలై 20న 2024 జూలై 19న వరదలు ప్రారంభమై సుమారు వారం రోజులు పాటు ఇన్‌ఫ్లో కొనసాగింది.

ముంపు మండలాల్లో భయం.. భయం

పోలవరం ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుకు వరద ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో 9.32 లక్షల క్యూసెక్కులు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఈ దశలో రహదారులపైకి నీరు చేరుతుంది. 11.44 లక్షల క్యూసెక్కులు దాటితే రెండవ ప్రమాద హెచ్చరికకు రహదారులు నీటమునిగి రాకపోకలు నిలిచిపోయి పదుల సంఖ్యలో గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళలోకి నీరు చేరుతుంది. 14.26 లక్షల క్యూసెక్కులు దాటితే మూడో ప్రమాద హెచ్చరికతో రెండు మండలాల్లో 18 గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలోకి వెళ్తాయి. ఈ క్రమంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కే.వెట్రిసెల్వి ఆదేశించారు. ఇప్పటివరకు కుక్కునూరు మండలం గొమ్ముగూడానికి చెందిన 15 కుటుంబాలను మాత్రమే దాచారంలోని పోలవరం పునరావాస కాలనీకి తరలించారు.

గోదావరి ఉధృతి ఇలా
(పోలవరం నుంచి నీటి విడుదల)

తేదీ	విడుదలైన నీరు (క్యూసెక్కుల్లో)
జూలై 5	2,09,733
6	2,03,309
7	1,95,294
8	2,02,463
జూలై 9	2,27,066

అదనపు రుసుం అవసరం లేదు

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'పైసలిస్తేనే మీటర్లు' శీర్షికన సాక్షి పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీరు ఎస్.నరసింహమూర్తి స్పందించారు. తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని తణుకు పట్టణం, తణుకు, ఇరగవరం మండలాలకు సంబంధించి విద్యుత్ వినియోగదారులు కొత్త విద్యుత్ సర్వీసుల కోసం వార్డు, గ్రామ సచివాలయాల్లో, మీ సేవా కేంద్రాల్లో అవసరమైన ధ్రువపత్రాలను అందచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుకు సంబంధించి డిపాజిట్ మొత్తం ఆన్‌లైన్‌లో జమచేయాలని, వినియోగదారులు అంతకు మించి ఎలాంటి అదనపు రుసుములు చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. విద్యుత్ సర్వీసులకు పట్టణ పరిధిలో 24 గంటలు, గ్రామ పరిధిలో 7 రోజుల్లో సర్వీసులు ఇస్తారని చెప్పారు. కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు రుసుం చెల్లించిన 30 రోజుల్లో సర్వీసు ఇస్తామని, సర్వీసులకు సంబంధించి పేరు మార్పు, లైన్లు షిఫ్టింగ్, అదనపు లోడు పెంపునకు సచివాలయాల్లో, మీసేవా కేంద్రాల్లోను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ ఆర్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా గణేష్

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు భీమవరానికి చెందిన మారోజు వెంకట గణేష్‌ను రాష్ట్ర వైఎస్సార్ ఆర్‌టీయూసీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌కు ఘన నివాళి



దుబాయ్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: దివంగత సీఎం, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు దుబాయ్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి దుబాయ్‌లో గోసంగి ధనలక్ష్మి, జుత్తిగ శ్రీను (భీమవరం శ్రీను), వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించి, కేక కట్ చేశారు. అనంతరం యూఏఈ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాగితకుమార్, తరపట్ల మోహన్ మాట్లాడుతూ బడుగు బలహీన, మైనార్టీ వర్గాల ఆశాజ్యోతి, పేదల పాలిట పెన్నిధి వైఎస్సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో కటికతల ప్రకాష్, విజయ, సాంబార్ మణి, నాగమణి, ఆశీర్వాదం, ప్రసాద్, అశోక్, ఏసుబాబు, వంశీ, కోటి, ఆనంద్, నవీన్ పాల్గొన్నారు.

నరసాపురం-అరుణాచలం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



నరసాపురం-అరుణాచలం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస వర్మ

నరసాపురం: చెన్నై-నరసాపురం మధ్య ప్రతిపాదనలో ఉన్న వందే భారత్ రైలును పట్టాలెక్కించే ప్రయత్నాలు వేగంగా సాగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. ప్రతి బుధవారం నరసాపురం నుంచి అరుణాచలం మధ్య కొత్తగా ప్రవేశపెట్టిన రైలును మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త రైలు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పశ్చిమ డెల్టా నుంచి అరుణాచలం ప్రయాణించడానికి కొత్తగా ప్రవేశపెట్టిన ఈ రైలు ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రైల్వేస్టేషన్ మేనేజర్ మధుబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



రిటైల్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

భీమవరం: యువతను చెడుమార్గం పట్టించే మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్నా, అక్రమంగా విక్రయించినా ఉపేక్షించేది లేదని, షాపు యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు బుధవారం జిల్లాలోని వివిధ విద్యాసంస్థల సమీపాన ఉన్న రిటైల్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల అమ్మకాలను నివారించమే ధ్యేయంగా ఆకస్మిక దాడులు చేయిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో భాగంగా దుకాణాలలో విక్రయిస్తున్న నిషేధిత గుట్కా, పాన్, ఖైనీ వంటి హానికర ఉత్పత్తులు ధ్వంసం చేసి దుకాణ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

జిల్లా రెడ్‌క్రాస్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు రామభద్రిరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా 2022–2023 సంవత్సరానికి ఉత్తమ జిల్లా అవార్డు అందుకుంది. అవార్డును జిల్లా చైర్మన్ డా.భద్రిరాజు ఎంఎస్‌పీఎస్ గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. రెడ్ క్రాస్ నిధుల సేకరణలో విశేష కృషి చేసిన వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్.వేణుగోపాల్, రిటైర్డ్ జిల్లా విద్యా అధికారి ఆర్.వి.రమణ మెడల్స్ అందుకున్నారు. కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు సి.నాగరాణి జిల్లా రెడ్‌క్రాస్ టీంను అభినందించి, అవార్డు పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక సంఘాల సమ్మె విజయవంతం



భీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

భీమవరం: కార్మిక హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మిక సమ్మె బుధవారం భీమవరంలో విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటియూ ఆధ్వర్యంలో పట్టణంలో వేర్వేరుగా ర్యాలీలు, సభలు నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి కార్మికులు తాలూకా ఆఫీసు సెంటర్, ప్రకాశంచౌక్, అంబేడ్కర్ సెంటర్ మీదుగా జువ్వలపాలెం రోడ్డులోని వెంకటేశ్వరస్వామి గుడి వరకు, అక్కడ నుంచి తిరిగి ప్రకాశం చౌక్ సెంటర్‌కు చేరుకున్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, రాష్ట్ర నాయకుడు ఖాదర్ బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలయితే కార్మికులు జీవించే హక్కు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పనికి తిలోదకాలిస్తూ 12 గంటలు పని తీసుకురావడం అత్యంత దుర్మార్గమన్నారు. సమ్మెలో భాగంగా పోస్టాఫీసు, బ్యాంకులు, వాణిజ్య సంస్థలను మూసివేయించారు. సీఐటీయూ కార్యాలయం వద్ద నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పట్టణంలో ఎర్రజెండాలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తూ చట్టాలు మారుస్తుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు మద్దతు పలకడం దారుణమని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరామ్ మాట్లాడుతూ దోపిడీ పాలకులకు ఓట్లు వేసినంత కాలం కార్మికుల బతుకుల్లో వెలుగు రాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరరావు, యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు కె.భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీల రిజర్వేషన్ల ఖరారు

ఆకివీడు: పశ్చిమ గోదావరి జిల్లాలోని 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషను ఖరారు చేస్తూ జిల్లా వ్యవసాయ ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ ఆదేశాలు జారీ చేసింది. ఉండి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి(ఓసీ), ఆకివీడు(బీసీ), ఆచంట(బీసీ ఉమెన్), పెనుగొండ(ఓసీ), అత్తిలి (ఓసీ), తణుకు (ఎస్సీ), భీమవరం(ఓసీ ఉమెన్), పాలకొల్లు (బీసీ), తాడేపల్లిగూడెం (ఎస్సీ ఉమెన్), నరసాపురం చైర్మన్(ఓసీ)లకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నన్ను చంపాలని చూస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఏలూరులో ఏఎస్పీ సూర్యచంద్రరావుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: కొల్లేరు వాసులకు ఒక్క రూపాయి బాకీ ఉన్నానని నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం ఏలూరు జిల్లా కొండలరావుపాలెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, అబ్బయ్యచౌదరిని ఇబ్బంది పెడితే దెందులూరులో రాజకీయంగా పెత్తనం చేయవచ్చని భావిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే అబ్బయ్యచౌదరి ఇంటికి వెళ్లండి.. ముట్టడించండి, వంటావార్పు చేయండని ఎమ్మెల్యే చింతమనేని పిలుపునిచ్చారని మండిపడ్డారు. తనను బెదిరించి హతమార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. తాను ఉన్నత ఉద్యోగాన్ని వదిలి మంచి చేసేందుకే రాజకీయాల్లో వచ్చానని అన్నారు. ఐదేళ్ల శాసనసభ్యుడిగా ప్రజలకు ఎంతో సేవ చేశానని.. ఏ ఒక్కరి దగ్గర రూపాయి కూడా తీసుకునే ఆలోచన తమకు లేదన్నారు. నాలుగు దశాబ్దాలుగా సేవ చేసే కుటుంబంగా ప్రజలతో కొఠారు కుటుంబానికి అనుబంధం ఉందన్నారు. తన హయాంలో టీడీపీ కార్యకర్తలకు సైతం మంచి చేశానన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి కుటుంబంతో కూడా సమయం గడపకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటున్నానన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 20 ఏళ్ల తర్వాతైనా తాను చేసిన మంచి కనిపిస్తుందన్నారు. అలాంటి తన ఇంటిపై రాళ్ల వేసి, వంటావార్పులు పెట్టించి ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు చెరువులు, పొలాలు ఆక్రమిస్తున్నారని, పెట్రోల్ బంకులు, ఇల్లు ధ్వంసం చేస్తున్నారన్నారు. రౌడీషీటర్లను పంపి భయపెట్టాలని చూశారని.. 144 సెక్షన్ ఉన్నా, పోలీసులు ఆపుతున్నా దెందులూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తన ఇంటికి వచ్చి అండగా నిలిచారని అబ్బయ్య చౌదరి అన్నారు.

కొల్లేరులో వికృత రాజకీయ క్రీడ

కొల్లేరు ప్రాంతంలో వికృత రాజకీయ క్రీడ జరుగుతుందని అబ్బయ్యచౌదరి అన్నారు. తన తండ్రి రామచంద్రరావు సహకారంతోనే చింతమనేని ఎంపీపీ అయ్యారని గుర్తు చేశారు. కొల్లేరు వాసులను బెదిరించి, తమపై ఉసిగొల్పుతున్నారని.. మీకు గాని, మీ గ్రామానికి గాని బాకీ ఉన్నానని నిర్ధారించేందుకు తాను కమిటీ వేస్తానని, మీరు కూడా ఒక కమిటీ వేసి నిజనిర్ధారణకు రావాలని ఏలూరు కోటదిబ్బ వద్ద నిరసన తెలుపుతున్న వారిని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పీ కూడా కమిటీలో భాగస్వాములై నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయబాబు, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని, జానంపేట ప్రసాద్‌బాబు, అప్పన్న ప్రసాద్, తేరా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీకి ఫిర్యాదు : నియోజకవర్గంలో పరిణామాలతో పాటు రెండు రోజులుగా జరుగుతున్న సంఘటనలపై కొఠారు అబ్బయ్యచౌదరి ఏలూరులో ఏఎస్పీ నక్కా సూర్య చంద్రరావుకు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందచేశారు.

మాక్ డ్రిల్ నిర్వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పరిశ్రమలను ప్రమాదరహితంగా నిర్వహించేందుకు నిబంధనల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా క్రైసిస్ గ్రూప్ సభ్యులు, పరిశ్రమల ప్రతినిధులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ద్వారా ఎలాంటి ప్రమాదాలు సంభవించలేదని, భవిష్యత్తులో కూడా పరిశ్రమల నిర్వహణ నిబంధనలను కచ్చితంగా పాటించి ప్రమాద రహిత జిల్లాగా ఉండేలా అధికారులు కృషి చేయాలి అన్నారు. జిల్లాలో ఉన్న 54 ప్రమాదకర పరిశ్రమలలో జిల్లా స్థాయి కమిటీ 43 పరిశ్రమలను తనిఖీ చేసి ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను రూపొందించిందన్నారు. మిగతా 6 యూనిట్లు కూడా వెంటనే పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కె.వెంకటేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిశ్శబ్ద విప్లవం రసాయన శాస్త్రం



నన్నయ్య గూడెం ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

తాడేపల్లిగూడెం: ప్రపంచాన్ని మార్చే నిశ్శబ్ద విప్లవం రసాయన శాస్త్రమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.ప్రసన్నశ్రీ అన్నారు. పట్టణంలోని నన్నయ్య వర్సిటీ ప్రాంగణంలో బుధవారం ప్రారంభమైన రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్ అనలైటికల్ అండ్ ఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్ అంశంపై అంతర్జాతీయ సమావేశంలో భాగంగా ఆమె మాట్లాడారు. మానవ జీవనంలో రసాయన శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కోవిడ్ మహమ్మారి తర్వాత ఆరోగ్య వ్యవస్థ సంస్కరణలలో అద్భుతమైన పురోగతి సాధించామన్నారు. మానవ జీవితంలో కెమిస్ట్రీ, ఫార్మసీ పాత్ర కీలకమైందన్నారు. జన్యు చికిత్స వైద్యం, అనేక ఆవిష్కరణల వైపు ఫార్మా పరిశ్రమ అభివృద్ధి చెందుతోందన్నారు. కెమిస్ట్రీలో ఇటీవలి ధోరణులు, పురోగతి గురించి చర్చించడానికి ఈ సదస్సు చక్కని వేదిక అవుతుందన్నారు. రోవాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెవీ రామానుజాచారి, చైనా సైంటిస్టు ఎస్.నాగన్న, నిట్ వరంగల్ ప్రొఫెసర్ పి.నాగేశ్వరరావు, గూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో వ్యాపారాలతో అభివృద్ధి



ఔత్సాహిక వ్యాపారవేత్తలతో మాట్లాడుతున్న డీపీటీవో షబ్నం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీకి సంబంధించి ఖాళీగా ఉన్న స్థలాలను ఔత్సాహిక వ్యాపారవేత్తలకు లీజుకు ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి ఆర్టీసీ కృషి చేస్తోందని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం అన్నారు. బుధవారం స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఔత్సాహిక వ్యాపారులతో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని కలిదిండి, భీమవరం, ఆకివీడు ప్రాంతాల్లోని ఆర్టీసీ ఖాళీ స్థలాలను 15 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానించామన్నారు. ఈ టెండర్లకు సంబంధించిన వివరాలు, లీజుకు ఉండే నియమ నిబంధనలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజ్ బీ. వాణి, డీఈ బీవీ రావు, ఏఈ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, పిల్లలు కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

భీమవరం: తన భార్య బెల్లం రమ్య, తన పిల్లలు కన్పించడం లేదంటూ భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన బొల్లం సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ ఎస్సై రామరావు చెప్పారు. వివరాల ప్రకారం ఈ నెల 5న సుబ్బారావు పనికివెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య, పిల్లలు కన్పించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ప్రయోజనం లేకపోవడంతో సుబ్బారావు పోలీసులను ఆశ్రయించాడు.

14న మెగా జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. జితేంద్ర బాబు తెలిపారు. ఈ మేరకు బుధవార ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 30కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 2,500 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు 81435 49464, 89785 24022, 94934 82414 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

మత్స్యం.. కొల్లేరు ప్రత్యేకం

- నేడు జాతీయ చేపల రైతు దినోత్సవం
- ఉమ్మడి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు



కొల్లేరులో చేపల పట్టుబడులు చేస్తున్న దృశ్యం (ఫైల్)



చేపకు హార్మోన్ ఇంజక్షన్ ఇస్తున్న హేచరీ సిబ్బంది

కైకలూరు: చేపల గుడ్లు(స్పాన్) ఉత్పత్తికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చేసిన ప్రయోగ ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ఆక్వారంగం అగ్రభాగాన నిలుస్తోంది. ఒడిశా రాష్ట్రం కటక్ సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఏఆర్)లో 1957 జూలై 10న డాక్టర్ హీరాలాల్ చౌదరీ, డాక్టర్ అలికున్హి శాస్త్రవేత్తలు కలిసి భారతదేశ మేజర్ కార్ప్స్‌పై విజయవంతమైన ప్రేరిత పెంపక ప్రయోగాన్ని(ఇన్‌డ్యూసిడ్ బ్రీడింగ్) చేపట్టారు. సాధారణ చేపల్లో ఉదాహరణకు ఐదు లక్షల స్పాన్ ఉత్పత్తి చేస్తే ప్రేరిత ప్రయోగం వల్ల ఆ సంఖ్య 10 నుంచి 20 లక్షలకు చేరింది. అప్పటి నుంచి నీలి విప్లవం తారా స్థాయికి పాకింది. బ్రీడింగ్ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా జాతీయ చేపల రైతుల దినోత్సవం జూలై 10న జరుపుకుంటారు. ఉమ్మడి జిల్లాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాలన నిర్వహిస్తున్నారు.

రికార్డు స్థాయిలో ఆక్వా సాగు

ఉమ్మడి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఆక్వా రంగం నుంచి వార్షిక ఉత్పత్తి 4 లక్షల టన్నులు ఉండగా, వార్షిక టర్నోవర్ రూ.18 వేల కోట్లు ఉంది. దాదాపు ఆక్వా రైతులు 75 వేల మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ జిల్లాల నుంచి 3.5 లక్షల టన్నులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక రాష్ట్రం విషయానికి వస్తే 974 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉంది. రాష్ట్రంలో మొత్తం ఆక్వా సాగు 2.26 హెక్టార్లులలో కొనసాగుతుంది. దిగుబడులు 10 లక్షల టన్నులుగా ఉంది. అమెరికాకు ఎగుమతి చేసే రొయ్యలు 3.27 లక్షల టన్నులుగా నమోదైంది. దేశంలోనే సింహభాగం ఉత్పత్తులకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు మణిహారంగా మారాయి.

నీలి విప్లవంతో రికార్డులు

ఆక్వా సాగులో 1955 పూర్వం చేపల సాగు చేయాలంటే నదులు, సముద్రాలలో చేప పిల్లలను సేకరించాల్సి వచ్చేది. దీన్ని వైల్డ్ కలక్షన్ అంటారు. డాక్టర్ హీరాలాల్ చౌదరీ భారతీయ మేజర్ కార్ప్స్ (కట్లా, రోహు, మ్రిగల్)పై హార్మోన్ ప్రేరేపిత ప్రయోగం చేశారు. దీంతో కోట్లలో చేప స్పాన్ అందుబాటులోకి వచ్చింది. తర్వాత అన్యదేశ కార్ప్స్(కామన్ కార్ప్, గ్రాస్ కార్ప్, సిల్వర్ కార్ప్), టిలాపియా, పంగాసియస్ వంటి ఇతర చేపలు, మంచినీటి రొయ్యలైన మాక్రోబ్రాకియం, రోజెంబర్గి(స్కాంపీ) కూడా అభివృద్ధి చెందాయి. ఒక్క ప్రయోగం భారతీయ మత్స్య పరిశ్రమను సమూలంగా మార్చివేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నర్సరీలు, పెంపక చెరువులు నాణ్యమైన చేప విత్తనాల సరఫరాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఇవి రాష్ట్రానికి మాత్రమే కాక, దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా చేప విత్తనాలను సరఫరా చేస్తున్నాయి.

అవగాహన కల్పిస్తాం

ప్రేరేపిత ప్రయోగం విజయవంతం ద్వారా డాక్టర్ హీరాలాల్ చౌదరీ నీలి విప్లవానికి పితామహుడిగా మారారు. ఆయన 1994లో వరల్డ్ ఆక్వాకల్చర్ అవార్డు అందుకున్నారు. ప్రతి ఏటా మత్స్యశాఖ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కైకలూరు ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌లో రైతులకు గురువారం అవగాహన కలిగిస్తాం.

– సీహెచ్ గణపతి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, కైకలూరు

ఆక్వా అంటేనే కొల్లేరు

ఆక్వా పరిశ్రమకు కొల్లేరు లంక గ్రామాలు పెట్టింది పేరుగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల్లో 9 మండలాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. చిత్తడి నేలల కారణంగా చేపల, రొయ్యల పెరుగుదల అధికంగా ఉంటుంది. ఇక చేప పిల్లలను ఉత్పత్తి చేసే ప్రభుత్వ హేచరీ ఏలూరు జిల్లా బాదంపూడిలో ఉంది. చేప నారును సాగు చేసే మత్స్యశాఖనకు చెందిన సీడ్ ఫాంలు ఏలూరు, కొవ్వలిలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల నుంచి ప్రతి రోజూ 240 లారీలు ఎగుమతులు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయి. రాష్ట్రంలో ఆక్వాకు సంబంధించి ప్రాసెసింగ్ ప్లాంట్లు 106, ఐస్ ప్లాంట్లు 258, ఏడాదికి 60,000 మినియన్ల ఉత్పత్తి చేసే రొయ్యల హేచరీస్, ప్రతి రోజూ 9,750 టన్నుల ఉత్పత్తి చేసే మేతల ఫ్యాక్టరీలు 429, ఆక్వాషాపులు 1104, ఆక్వా ల్యాబ్‌లు 237 ఉన్నాయి.

641 కిలోల గంజాయి ధ్వంసం



గంజాయిని ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం : జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు 641 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో జిల్లాలోని 23 పోలీస్ స్టేషన్ల పరిధిలో 64 కేసుల్లో సుమారు 641 కిలోల గంజాయిని బుధవారం గుంటూరు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామపరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ వద్ద ధ్వంసం చేసినట్లు తెలిపారు. ధ్వంసం చేసిన గంజాయిని ముందుగా ఈనెల 8న భీమవరం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని రిసెప్షన్ హాల్లో మధ్యవర్తుల సమక్షంలో కేసుల వారీగా తూకం వేసి పరిశీలించి దానిని ప్రత్యేక కవర్లు, సంచులలో పెట్టి సీలు వేసి పోలీసు బందోబస్త్ మధ్య గుంటూరు తరలించినట్లు పేర్కొన్నారు.

మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త కె.రాధారాణి

నూజివీడు: కోతలు పూర్తయిన నేపథ్యంలో మామిడి తోటల్లో రైతులు కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని నూజివీడు మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.రాధారాణి పేర్కొన్నారు. మండలంలోని కొత్తరావిచర్లలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రాధారాణి మాట్లాడుతూ కొమ్మ కత్తిరింపులు చేయడం వల్ల చెట్ల గాలి వెలుతురు ప్రసరణ బాగా జరిగి పూత, కాపు సరిగ్గా వస్తాయని, తెగుళ్లు, పురుగుల బెడద తగ్గుతుందన్నారు. చెదురుమదురుగా ఉన్న కొమ్మలను ఏటవాలుగా కత్తిరించి కత్తిరించిన చోట బ్లైటాక్స్‌ను పూయాలన్నారు. తోటల్లో దుక్కులు చేపట్టి చెట్టుకు చుట్టూ పాదులు చేసి పదేళ్ల వయస్సు పైబడిన చెట్లకు యూరియా 2 కిలోలు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 4 కేజీలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 1.5కేజీలు, బోరాన్ 100గ్రాములు, జింక్ సల్ఫేట్ 100గ్రాములు చొప్పున ఒక్కొక్క చెట్టుకు వేయాలన్నారు. ఆమె వెంట ఉద్యానశాఖ అధికారి ఆర్.హేమ, సర్పంచి కాపా శ్రీనివాసరావు ఉన్నారు.

పెరిగిన మద్యం అమ్మకాలు

నూజివీడు: నాటు సారాను అరికట్టడం ద్వారా ఏలూరు జిల్లాలో మద్యం అమ్మకాలను గతేడాది జూన్ నెలతో పోలిస్తే ఈ ఏడాది జూన్ నెలలో 14 శాతం పెరిగాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ ప్రభుకుమార్ వెల్లడించారు. నూజివీడులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా నాటు సారాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన బాలకృష్ణ, చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడేనికి చెందిన ఇస్లావతు రాములను పీడీ యాక్ట్ కింద అదుపులోకి తీసుకుని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనలో అతివలు

- శ్రీవారి క్షేత్రంలో భగవద్గీత పారాయణం, స్వామివారి గానామృతం
- రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేస్తున్న మహిళలు
- 500 మందితో ప్రత్యేక కార్యక్రమాలు



భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు (ఫైల్)

ద్వారకాతిరుమల: మానసిక ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతతనిచ్చేది ఆధ్యాత్మిక చింతన. ఆ దిశగా అడుగులు వేస్తూ తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, దేవుని సేవలో తరిస్తున్నారు వందలాది మంది మహిళలు. బృందాలుగా ఏర్పడి, దేవాలయాల్లో భగవద్గీత పారాయణలు చేస్తున్నారు. అందులో భాగంగా తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీవారి సన్నిధిలో శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ శిష్య బృందం భగవద్గీత పారాయణం, స్వామివారి గానామృతం చేశారు. ఇందులో రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన 500 మంది మహిళలు పాల్గొన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో కామవరపుకోట మండలం జలపవారిగూడెంకు చెందిన కామిశెట్టి రాంబాబు, ఉషారాణి దంపతుల ఆధ్వర్యంలో సామాన్య భక్తులు సైతం భాగస్వాములయ్యారు.

దూరాన్ని లెక్కచేయకుండా..

ఏలూరు జిల్లాకు చెందిన మహిళలతో పాటు బెంగళూరు, హైదరాబాద్, ఖమ్మం, వైర, సత్తుపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, పాల్వంచ, అలాగే విశాఖపట్నం, నూజివీడు, తిరువూరు, వినన్నపేట, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మహిళా భక్తులకు శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు స్వామి వారి ఉచిత దర్శనంతో పాటు, అన్నప్రసాదాన్ని అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ఏఈఓలు పి.నటరాజారావు, రమణరాజు, సూపరింటెండెంట్‌లు కోటగిరి కిషోర్, గోవాడ సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు.

సంతృప్తినిచ్చింది



ఆన్‌లైన్‌లో భగవద్గీత పారాయణం నేర్చుకున్నాను. తొలిసారిగా శ్రీవారి సన్నిధిలో, అది కూడా తొలి ఏకాదశి రోజున భగవద్గీత పారాయణం, గానామృతం చేయడం సంతృప్తినిచ్చింది. ఈ కార్యక్రమాల నిర్వహణకు దేవస్థానం అధికారులు పూర్తి సహకారాన్ని అందించారు.

– కామిశెట్టి ఉషారాణి, కామవరపుకోట మండలం జలపవారిగూడెం

ప్రశాంతత లభిస్తుంది



ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే మానసిక ప్రశాంతత లభిస్తుంది. అందుకే హైదరాబాద్ నుంచి వచ్చాను. తొలి పండుగ నాడు అధిక సమయం శ్రీవారి సన్నిధిలో గడపడం, ఆ స్వామివారిని దర్శించుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– కొమ్మూరి గాయత్రి, హైదరాబాద్.

ఏడు వందల శ్లోకాలు కంఠస్థం



భగవద్గీత పారాయణను ఆన్‌లైన్ ద్వారా నేర్చుకున్నాను. గోల్డ్‌మెడల్ కూడా వచ్చింది. శ్రీవారి సన్నిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో 700 శ్లోకాలు కంఠస్థం చేసిన సుమారు 200 మంది గోల్డ్‌మెడలిస్టులం పాల్గొన్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా పారాయణం, గానామృతం చేశాం.

– సెనగపల్లి పూర్ణిమ, విజయవాడ

కుమారుడిపై తల్లి ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: మద్యం మత్తులో తనపై దాడి చేస్తున్నాడంటూ కుమారుడిపై తల్లి స్థానిక పోలీసుస్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వాడవల్లికి చెందిన నిమ్మగడ్డ నాగేశ్వరరావు, మేరమ్మ దంపతులకు నలుగురు కుమారులున్నారు. తండ్రి నాగేశ్వరరావు అనారోగ్యంతో మంచంపై ఉన్నాడు. చివరి కుమారుడైన విజయకుమార్ భార్యను వదిలేసి తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విజయకుమార్ మద్యం మత్తులో కత్తిపీటతో తనపై దాడి చేసినట్లు మేరమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఫిర్యాదు చేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ అధికారుల బదిలీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల నిర్వహించిన పదోన్నతుల్లో నిడదవోలు విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి జేఓగా నియమితులైన సీహెచ్ శ్రీనివాసరావును పరిపాలనా సౌలభ్యం కోసం రామచంద్రాపురం విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే రామచంద్రాపురం విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి ఇటీవల పదోన్నతిపై వెళ్ళిన ఎంవీఎస్ఎస్‌వీ ప్రసాద్‌ను నిడదవోలు విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఇరగవరం : మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ స్కూలు ఆవరణ అంతా తిరిగి పరిశీలించారు. విద్యార్థులు అమ్మ పేరుతో నాటేందుకు సిద్ధపరిచిన మొక్కలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకంలో తయారు చేసే వంటశాలకు వెళ్లి వండిన వంటకాలను, స్టాక్ రూములో ఉన్న స్టాకును పరిశీలించారు. గురువారం నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ డే మీట్ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, తహసీల్దార్ ఎం.సుందర్ రాజు ఉన్నారు.

విద్యాసంస్థల బస్సులపై 18 కేసులు



బస్సులను తనిఖీ చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లావ్యాప్తంగా బుధవారం వాహన తనిఖీ అధికారులతో విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేయించినట్లు ఏలూరు ఇన్‌చార్జ్ రవాణా శాఖాధికారి ఎస్‌బీ శేఖర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం వివిధ విద్యా సంస్థలకు చెందిన 63 బస్సులను తనిఖీ చేసినట్లు తెలిపారు. వాటిలో పన్నులు చెల్లించని, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ లేని, పలు నిబంధలను అతిక్రమించిన 18 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో ప్రారంభమైన కారణంగా విద్యా సంస్థల యాజమాన్యాలు నిర్వహించే బస్సులన్నీ నిబంధనలకు లోబడి తిప్పాలని, అన్ని బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో, ఇన్సూరెన్స్‌తో, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లతో మాత్రమే తిప్పాలని సూచించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అమీనాపేట ఏటిగట్టున ఉన్న సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర వసతి గృహాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహం కిటికీలకు దోమల మెష్ లేకపోవడం వల్ల దోమల బెడద ఉంటుందని విద్యార్థులు తెలిపారని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. వసతి గృహానికి రాని విద్యార్థుల వివరాలు సేకరించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, తిరిగి పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



తులిమెల్లి త్రినాథ్ (ఫైల్)

చింతలపూడి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపాలెం గ్రామానికి చెందిన తులిమెల్లి త్రినాథ్ (24) చింతలపూడి వైష్ణవి మెడికల్ షాప్‌లో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5న రాత్రి మెడికల్ షాప్ కట్టి ద్విచక్రవాహనంపై స్వగ్రామం లింగపాలెం బయలుదేరాడు. చింతలపూడి బైపాస్ రోడ్డు వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో బైక్ అదుపుతప్పి గుంతలో పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు యువకుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించి మెరుగైన చికిత్సకోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ త్రినాథ్ చనిపోవడంతో మృతుని తండ్రి తులిమెల్లి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉర్దూ పాఠశాల వివాదంపై ఆర్‌జేడీ విచారణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ (మాకా) ఉర్దూ పాఠశాల, తూర్పువీధి ఉర్దూ పాఠశాలల్లో జరుగుతున్న వివాదాలపై పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి బుధవారం విచారణ నిర్వహించారు. తొలుత ఆ రెండు పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే మాధ్యమంలోనే బోధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుల నుంచి రెండు మాధ్యమాల్లో బోధిస్తామని లేఖలు రాయించుకున్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విచారణలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

భీమవరం: ఉండి మండలం చెరుకువాడ వద్ద గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు భీమవరం రైల్వే ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం బుధవారం చెప్పారు. ఈ నెల 1న గుర్తు తెలియని 50 ఏళ్ల వ్యక్తి రైలు నుంచి జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పగా బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె విజయవంతం



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె విజయవంతమైనట్లు ఇఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ పేర్కొన్నారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఐఎఫ్‌టీయూ పాల్గొంది. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మామిడి దాన వర ప్రసాద్ మాట్లాడుతూ మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దూకుడుగా వ్యవహరిస్తూ కార్మిక వర్గాన్ని కాల రాసేందుకు చూస్తున్నాడని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. రానున్న రోజులలో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సత్యనారాయణ, బండి దుర్గాప్రసాద్, శేఖర్, రాంబాబు, వెంకటేశ్వరరావు, నాని, వాసు, రమణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్



తణుకులో బెల్ట్‌షాపు నిర్వాహకుడితో ఎస్సై లక్ష్మి

తణుకు అర్బన్: బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. బుధవారం తణుకు మండలంలోని ముద్దాపురంలో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో తుపాకుల శివగణేష్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. అనధికారికంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, కానిస్టేబుల్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం



మొక్కలు నాటుతున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని డైమండ్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు ప్రాంతాలలో, రోడ్డు మార్జిన్‌లు వద్ద బుధవారం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు, మాజీ నేవీ అధికారి తంగెల్ల రవీంద్రబాబు, ఆర్మీ డిప్యూటీ లెఫ్టినెంట్ హరిబాబులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఆక్సిజన్ అవసరమని, నీడ నిచ్చే, చక్కని గాలిని ఇచ్చే మొక్కలను ప్రతి ఒక్కరు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్ నాయుడు, చెన్నరెడ్డి సతీష్, జి.రాజు, కుందుం వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిర్వహిస్తున్న సమ్మెలో దాదాపుగా 30 కోట్లు మంది పాల్గొన్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ స్పష్టం చేశారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల సభ్యులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హౌసింగ్‌బోర్డు ఎస్వీఆర్ రంగారావు సెంటర్‌లో బహిరంగ సభ జరిగింది. డి.సోమసుందర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి నుంచి పోరాడి సాధించుకున్న హక్కులను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు.

తహసీల్దార్ కోర్టులో ఐదుగురిపై బైండోవర్

తాడేపల్లిగూడెం రూరల్: డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో ఐదుగురు పాత నేరస్తులను బుధవారం తాడేపల్లిగూడెం మండల మెజిస్ట్రేట్ ఎం.సునీల్ కుమార్ ఎదుట హాజరు పర్చినట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపా రు. పాత నేరస్తుల్లో సత్ప్రవర్తన కోసం ఏడాది కాలానికి రూ.1.50లక్షలు బాండ్ విలువకు బైండోవర్ చేసినట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిచే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ స్వరాజ్యలక్ష్మి హెచ్చరించారు.

మున్సిపల్ కాంప్లెక్స్.. సమస్యలమయం

- శిథిలావస్థలో ప్రకాశం మున్సిపల్ కాంప్లెక్స్
- అవస్థలు పడుతున్న ప్రజలు



పాడైన ప్రకాశం మునిసిపల్ కాంప్లెక్స్



కాంప్లెక్స్ పైభాగంలో పడిన పిట్టగోడ, మొక్కలు



పై అంతస్తులో పెచ్చులు ఊడుతున్న శ్లాబ్



పై అంతస్తులో అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు



రూంలో ఊడిపడుతున్న పెచ్చులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక వన్‌టౌన్‌లో పురపాలక సంఘానికి కూత వేటు దూరంలో ఉన్న ప్రకాశం మునిసిపల్ కాంప్లెక్స్ నేడు శిథిలావస్థలో ఉంది. పాలకులు, అధికారులు అభివృద్ధి చేయాలని, మునిసిపాలీకి ఆదాయం వచ్చే విధంగా చూడాలని వ్యాపారస్తులు, ప్రజలు కోరుతున్నారు. అత్యంత్త ఖరీదైన స్థలంలో ఈ మునిసిపల్ కాంప్లెక్స్ ఉంది. కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకుంటే మునిసిపాల్టీకి ఎక్కువ మొత్తంలో ఆదాయం వస్తుంది. ప్రస్తుతం కాంప్లెక్స్ కింద భాగంలో షాపులు నిర్వహిస్తున్నారు. టైలర్స్ అసోసియేషన్ షాపులు కూడా ఉన్నాయి. వీరు అందరి వద్ద నుంచి మునిసిపాలిటీ అద్దెలు వసూలు చేస్తున్నాయి. అయితే ఈ కాంప్లెక్స్‌కు సంబంధించి పైన ఉన్న అంతస్తులో కూడా షాపులను నిర్వహించేందుకు వీలుగా రూంలు ఉన్నాయి. ప్రస్తుతంపై అంతస్తులో ఒక రూంలో మాత్రమే సచివాలయం ఉంది. మిగిలిన అన్ని షాపులు నిరూపయోగంగా మారాయి. ఈ కాంప్లెక్స్‌కు రెండు వైపుల మెట్లు ల్యాండింగ్‌లు కూడా ఉన్నాయి.

శిథిలావస్థలో భవనం

యాభై సంవత్సరాలకు పైగా ఈ భవనం పట్టణంలో ఉంది. నేడు భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. గతంలో పై అంతస్థు షాపులు కూడా వ్యాపారులకు అద్దెకు ఇచ్చేవారు. అనంతరం రూంలు పాడైపోయాయి. నేడు ఆ షాపులు అస్తవ్యస్తంగా మారాయి. పై అంతస్తును ఎవరూ ఉపయోగించక పోవడంతో అంతస్తులో ఉన్న రూంలు ఎందుకు పనికిరాకుండా పోయాయి. అనేక ప్రాంతాలలో గోడలు బీటలు రావడంతో పాటు రూఫ్ కూడా పెచ్చులు వూడిపోతున్నాయి. అంతస్థుపై భాగంలోను, మొదటి అంతస్తు రూంలో కూడా మొక్కలు పెరుగుతున్నాయి. వరండా అంతా చెత్త చెదారాలతో అస్తవ్యస్తంగా మారింది. వర్షకాలంలో పై శ్లాబ్ నుంచి నీరు కారడంతో రూంలలోకి నీరు చేరుతుంది. భారీగా నీరు చేరడంతో దిగువ ఉన్న షాపులలోకి కూడా లీకేజీలు రావడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వ్యాపారస్తులు ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలోపై అంతస్తు ఖాళీగా ఉండటంతో మందుబాబులు వీరంగం చేస్తున్నారు. అంతస్థులో రెండు వైపుల మరుగుదొడ్లతో పాటు యూరినల్స్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. వాటిని ఉపయోగించడమే తప్ప శుభ్రం చేసే వారే లేకపోవడంతో మురుగుదొడ్లు, యూనిరనల్స్‌కు వెళ్లే రూంలు చెత్త చెదారాలతో దుర్వాసన వెదజల్లుతుంది.

రిపేర్లు చేయించాలి

భవనానికి అవసరమైన రిపేర్లు చేసి పై అంతస్తులో కూడా షాపులకు అద్దెకు ఇస్తే మునిసిపాలిటీకి మంచి ఆదాయం వస్తుందని, ఆ దిశగా ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. భవనంను రిపేర్లు చేయించి అవసరమైన మౌలిక వసతులు కల్పించి అందరికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను మార్చాలి. చిన్న వ్యాపారులకు అద్దెలకు ఇవాలని కోరుతున్నారు.

త్వరలో రిపేర్లు, హంగులు

పురపాలక సంఘం అధికారులు మాట్లాడుతూ ప్రకాశం మునిసిపల్ కాంప్లెక్స్‌లోని పై అంతస్తులో ఉన్న అపారిశుద్ధ్య పరిస్థితులను తొలగించడంతో పాటు రిపేర్లు, అదనపు హంగులు చేసేందుకు ఇంజనీరింగ్ సిబ్బందికి కమీషనర్ ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు.

ప్రభుత్వ బ్యాంకింగ్ పరిశ్రమను, సంస్థలను పరిరక్షించాలి



సెంట్రల్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ బ్యాంకింగ్ పరిశ్రమను, ప్రభుత్వ సంస్థలను పరిరక్షించాలని బ్యాంకింగ్ సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మె పట్టణ పరిసర ప్రాంతాలలో సంపూర్ణంగా జరిగింది. సమ్మెలో ఉన్న ఏఐబీఈఏ, ఏఐబీఓఏ, బీఈఎఫ్ఐ, ఏఐఐఈఏ, ఏఐఎల్ఐసీఈఎఫ్, ఏఐఎస్ఎల్ఐఈఎఫ్ తదితర సంఘాల మద్దతుతో బ్యాంకింగ్ కార్యకలాపాలు స్తంభించాయి. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో నాయకులు టీవీ సూర్యనారాయణ, సిద్ధాబత్తుల సూర్యనారాయణ, ఎస్.ఎస్.ప్రసాద్, బి.దివ్యరంజని, ఎం.కే చైతన్య, వీఆర్‌పిఎస్ఎస్ శాస్త్రి, కళ్యాణ్ చక్రవర్తి, లింగంపల్లి గాంధీ, వెంకటేశ్వరరావు, సౌమ్య, మేరీ, జ్యోతి తదితరులు మాట్లాడుతూ ప్రయివేట్, సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులలో కూడా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. సమ్మె చేస్తున్న ఉద్యోగులు స్టేట్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఇతర ప్రైవేట్ బ్యాంకులు వద్ద ధర్నాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ బ్యాంకు యూనియన్లు యాజమాన్యం మధ్య జరిగే సంప్రదింపులు, అగ్రిమెంట్స్ సకాలంలో సమగ్రంగా అమలు జరపాలని, ఉద్యోగ, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీ రోగులకు దుప్పట్ల పంపిణీ



తణుకు లెప్రసీ వార్డులో రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని లెప్రసీ వార్డులోని రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సెంటర్ బుల్లిరామయ్య తండ్రి పేరుమీద నెలకొల్పి ఆయన సహకారంతో సంఘం ద్వారా ఫిజియోథెరపీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముందుగా సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ వార్డు వైద్యాధికారి డాక్టర్ బంగారు రవిరాజు, సంఘ కార్యదర్శి ఎండీ స్వాలిహా, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు అక్కిన బాపినీడు, పరిమి సూర్యనారాయణ, వి.పార్వతి, పి.శివన్నారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు

తణుకు అర్బన్: కార్మిక వ్యతిరేక లేబరు కోడ్లు, పనిగంటల పెంపునకు నిరసనగా దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మె బుధవారం తణుకులో విజయవంతంగా నిర్వహించారు. తణుకులో వివిధ శాఖలకు చెందిన కార్మికులు రోడ్డుపైకి వచ్చి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ నాలుగు లేబరు కోడ్‌లతో కార్మికులు జీవించే హక్కు హరిస్తూ కట్టుబానిసలుగా మార్చే మోదీ సర్కార్ యత్నాలను తిప్పి కొట్టాలని అన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలు, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చడం కోసం మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని విమర్శించారు. 8 గంటల నుంచి 12 గంటల పని దినంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ఇచ్చిన జీవో పాలకుల చీకటి ఒప్పందాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. వేతనాలు నిర్ణయించే పద్ధతిని ద్వైపాక్షిక చర్చల ద్వారా కాకుండా ఏకపక్షంగా నిర్ణయించే పద్ధతిని కార్మికుల ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలి వారి శ్రమను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలలో అనేక మార్పులు చేసి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై కార్మికులు ఆధారపడలే చేస్తున్న విధానాలను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లాభాలు ఆర్జిస్తూ సమర్థవంతంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పచెబుతున్న పాలకులకు పోరాటాల ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. కార్మిక, కర్షకులకు మేలు జరిగే విధంగా పాలన చేయాలని, నేటి ప్రభుత్వాలు మాత్రం కార్పొరేట్ రారాజుల కోసం, విదేశీ బహుళ జాతి రాబందుల కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.అజయకుమారి, ఏఐటియుసి, సిఐటియు నాయకులు చిక్కాల దుర్గాప్రసాద్, ఎస్.ఫణీంద్ర, కె.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, దాకే ముసలయ్య, గార రంగారావు, దేవ పెద్దిరాజు, అట్రు వెంకట్రావు, మందుల ముత్తయ్య, అనంత విక్రమ్, బొంగు శ్రీరామమూర్తి, పిఎల్ నరశింహారావు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షుడు హరికుమార్ కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలమైనప్పటికి నేటికి డీఆర్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు, తగ్గించబడిన అడిషనల్ కోంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, ఐఆర్ 30 శాతం, ఇంటిరీయమ్ రిలీఫ్ ప్రకటించలేదని, సదరు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫైనాన్స్ బిల్లును అమలు చేయకుండా నిలువరించాలని కోరారు. ఈ నెల 15వ తేదీన భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగబోవు ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, అర్జునరావు, సుబ్రహ్మణ్యశర్మ, ముస్తాఫా, సూరెడ్డి, కృష్ణకుమారి, సుబ్బలక్ష్మి, జయరాజు, రామ్మోహన్‌రావు, నాగరాజు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలి



ఎల్ఐసీ వద్ద గేట్ మీటింగ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీమా ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలని, సంస్థలో 3, 4 తరగతుల ఉద్యోగాల నియమకాన్ని వెంటనే చేపట్టాలని జీవిత బీమా ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో ఎల్ఐసీ యూనియన్లు పాల్గొన్నాయి. ఎల్ఐసీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం గేట్ మీటింగ్ జరిగింది. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఉద్యోగుల సంఘం కార్యదర్శి సొలస సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్ ఇండియా ఇన్సూరెన్స్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గరికపాటి బాపయ్యశర్మ, ఏజెంట్స్‌యూనియన్ నాయకులు పి.గోవింద్, పీఎస్ఎన్ మూర్తి, వీరమల్లు అంజికుమార్, తోట పద్మారావు, రమేష్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లా గ్రంథాలయం ఉత్తర్వులు మేరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం బుక్ రీడర్స్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్స్ గరికిపాటి బాపయ్యశర్మ, ఎ.జనార్దనరావు, కోపల్లె శ్రీనివాస్, ప్రత్తి వీరాస్వామి, ఎం.సత్యనారాయణ, వీఆర్ ఆంజనేయులు, ఏవీఎస్ లక్ష్మణరావు, జాన్‌బాబు, ఎస్.కొండలరావు, పుష్పవతిలు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, 15 రోజుల కొకసారి జరిగే చర్చాగోష్టిలో పాల్గొనాలని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

13 మంది కోడిపందెం రాయుళ్లు అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ ఎస్సై జేవీఎస్. ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 13మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.30,700లు నగదు, మూడు కోడిపుంజులు, ఎనిమిది మోటారు సైకిళ్లు, ఐదు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ వివరించారు.

సూపర్ సిక్స్‌తో ప్రజల్ని మోసం చేశారు

తణుకు అర్బన్: సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజల్ని మోసం చేసి అందల మెక్కిన కూటమి నేతలు ఏడాది పూర్తయినా హామీలు నెరవేర్చకపోగా అన్ని చేసేశాం అనే విధంగా మాట్లాడడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి అన్నారు. బుధవారం తణుకు మండలం మండపాక గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌తో ఉన్న కరపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంచిన పింఛను, అరకొరగా తల్లికి వందనం తప్ప సూపర్‌సిక్స్‌లో అమలు చేసిన పథకాలు ఏమున్నాయని ప్రశ్నించారు.

నేడు అత్తిలిలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

అత్తిలి: వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ సమన్వయకర్త, ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ×బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ –రీకాల్లింగ్ బాబు మేనిఫెస్టోపై అత్తిలి మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు అత్తిలిలో షాదీఖానా భవనంలో జరుగుతుందని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

ఇరగవరం: అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకంకు అర్హత కలిగిన ప్రతి రైతు లబ్ధిపొందేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇరగవరం మండలం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ అర్హుల జాబితాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌశల్ భానో, తహసీల్దార్ ఎం సుందర్రాజు, వీఆర్వోలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించాలి

తాడేపల్లిగూడెం రూరల్: అంగన్‌వాడీ, ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో రూరల్ మండల సీఐటీయూ నాయకుల సమావేశం దీనస్వరూపారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేజీ యాప్‌లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.2.40లక్షల కోట్లు కేటాయించాలని, రోజు వారి కూలి రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనరస్‌గా దీనస్వరూపారాణి, కో–కన్వీనర్లుగా కస్సే నాగమణి, గోపిరెడ్డి దుర్గాభవానిలు ఎన్నికయ్యారు.

వర్సిటీ అభివృద్ధికి దాతల సహకారం అవసరం

నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రసన్నశ్రీ



గూడెంలోని నన్నయ్య ప్రాంగణం

తాడేపల్లిగూడెం: తమ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు వసతులు , సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారం కూడా అవసరమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ వి.ప్రసన్నశ్రీ అన్నారు. బుధవారం గూడెం వచ్చిన ఆమె కొంత సేపు విలేకర్లతో మాట్లాడారు. ఇటీవలి కాలంలోనే వీసీగా బాధ్యతలు తీసుకున్న తాను వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నానన్నారు. రాజమహేంద్రవరం ప్రాంగణంలో విద్యార్థులకు శుద్ధనీరు అందేదని, పేపర్ మిల్లు సహకారంతో ఈ సమస్యకు చూశామన్నారు. విద్యుత్ సమస్యలను కూడా పరిష్కరించినట్టు చెప్పారు. దాతృత్వానికి పెట్టింది పేరు ఉభయగోదావరి జిల్లాలని ఇక్కడి దాతల సహకారంతో అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. దాతలు ఎవ్వరైనా ముందుకొచ్చి నిధులిస్తే వారి పేరిటే భవనాల నిర్మాణం చేపడతామన్నారు. ప్రతి చెట్టును సంరక్షించాలనే కార్యక్రమం చేపట్టామని, యోగాంధ్రలో రెండు అవార్డులు వర్సిటీకి వచ్చాయన్నారు. గూడెం క్యాంపస్‌లో బాలికల వసతి గృహంలో ఇటీవలే కొత్త మంచాలు సమకూర్చామని, బాలుర వసతి గృహకోసం ప్రతిపాదన చేశామని, ఈసీ మీటింగ్‌లో చర్చించాలన్నారు. గూడెం క్యాంపస్‌లో రూ.30 కోట్లతో ఇంజనీరింగ్ కళాశాల స్థాపించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు ఆమె చెప్పారు. గూడెం క్యాంపస్‌లో కెమిస్ట్రీపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

కొత్త విషయాలు తెలుస్తాయి



గూడెం నన్నయ్య ప్రాంగణంలో కెమిస్ట్రీపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉంది. ఇలాంటి సదస్సుల నిర్వహణ ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. రసాయనశాస్త్రంలో నూతనంగా వస్తున్న పరిణామాలు గురించి ఆకళింపు చేసుకోవచ్చు. ఇలాంటివి విద్యార్థులకు ఉపయుక్తం. –పి.దరణి, ఎంఎస్సీ ఎనలైటికల్ కెమిస్ట్రీ

ఫార్మసీ రంగం విస్తరణ విషయాలు తెలిశాయి



కెమిస్ట్రీ అంతర్జాతీయ సదస్సు నిర్వహణ ద్వారా ఫార్మశీ రంగ విస్తరణ, కోవిడ్ ముందు, కోవిడ్ తర్వాత ఫార్మశీరంగంలో వచ్చిన మార్పులను గురించి తెలుసుకున్నాం . వర్సిటీ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి. విషయ పరిజ్ఞానానికి ఇవి ఉపకరిస్తాయి. –డి.సరస్వతి, బీ.ఫార్మశీ విద్యార్థి.

అంతర్జాతీయ విషయాలు తెలిశాయి



చిన్న పట్టణం లాంటి ఇలాంటి ప్రాంతాల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం వల్ల ఇక్కడి విద్యార్థులు అంతర్జాతీయ విషయాలు తెలుసుకొనే అవకాశం కలిగింది. కొత్త పుంతలు తొక్కుతున్న ఫార్మశీరంగ ఆవిష్కరణలు, జనరిక్ మెడిసిన్ తయారీ, వంటి విషయాలు నేర్చుకొనే సదవకాశం ఈ సదస్సు ద్వారా తెలుసుకున్నాం. – జి.శిరీష, బీ.ఫార్మశీ విద్యార్థి